

'స్త్రీశక్తి'కి అంతర్‌రాష్ట్ర మెలిక

- ఎపిలోని స్టేజీలకూ వర్తించని జీరో టికెట్
- పల్లె వెలుగు సర్వీస్ అయినా అదే పరిస్థితి
- నష్టపోతున్న సరిహద్దు మండలాల మహిళలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకంలో అంతర్‌రాష్ట్ర సర్వీసులను చేర్చకపోవడంతో చాలా మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందడం లేదు. ఆ బస్సుల్లో ఎపిలోని స్టేజీలకు కూడా జీరో టికెట్ వర్తించడం లేదు. పల్లె వెలుగు సర్వీస్ అయినా అది అంతర్‌రాష్ట్ర సర్వీస్ అయితే డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో సరిహద్దు మండలాల మహిళలు నష్టపోతున్నారు...

స్త్రీ శక్తి పథకం పేరుతో కూటమి ప్రభుత్వం ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తోంది. కర్నూలు జిల్లాలో 270 బస్సులకు ఉచిత ప్రయాణం కోసం కేటాయించారు. అందులో 186 పల్లెవెలుగు బస్సులు, 2 అల్ట్రా పల్లె వెలుగు బస్సులు, 82 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. ఆ బస్సుల్లోనూ అంతర్‌రాష్ట్ర సర్వీసులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని వర్తింపజేయలేదు. చివరికి పల్లె వెలుగు సర్వీస్ అయినా అది అంతర్‌రాష్ట్ర సర్వీస్ అయితే ఉచిత ప్రయాణం వర్తించడం లేదు. ఎమ్మిగనూరు నుంచి తెలంగాణలోని ఐజకు వెళ్లే పల్లె వెలుగు బస్సు జిల్లాకు సంబంధించి నందవరం మండలంలోని నందవరం, ముగతి, నాగలదిన్నె మీదుగా



నాగలదిన్నె నుండి తెలంగాణలోని అయిజకు వెళ్లే పల్లె వెలుగు బస్సు

వెళ్తుంది. ఆయా గ్రామాల నుంచి వందల సంఖ్యలో నిత్యం మహిళలు ప్రయాణిస్తూ ఉంటారు. ఆ గ్రామాల మహిళలు ఆ బస్సు ఎక్కితే జీరో టికెట్ రాదని చెబుతున్నారు. అంతర్రాష్ట్ర సర్వీసు పేరుతో మహిళల దగ్గర నగదు వసూలు చేస్తున్నారు. ఆధార్ కార్డు చెల్లదు, నగదు చెల్లించి టికెట్ తీసుకోవాలని కండక్టర్లు ఖరాకండిగా చెబుతున్నారు. మహిళలకు 'ఉచిత బస్సు సౌకర్యం ఉంది కదా' అని కండక్టర్‌ను అడిగితే.. 'మాకేమి తెలియదు. డబ్బులు ఇవ్వాల్సిందే' అంటూ సమాధానం ఇస్తున్నారు. ఆదోని నుంచి కర్ణాటకలోని శిరిగుప్పకు వెళ్లే పల్లె వెలుగు బస్సు ఆదోని మండలంలోని పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, మదిరె, చిన్న హరివాణం, గజ్జెహళ్లి మీదుగా వెళ్తుంది. ఆయా గ్రామాల మహిళలు నిత్యం ఆదోనికి ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఆ సర్వీసులు అంతర్‌రాష్ట్ర సర్వీసులు కావడంతో ఆయా గ్రామాల మహిళలు డబ్బులు పెట్టి బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. కర్నూలు, ఎమ్మిగనూరు నుంచి ఆదోని, ఆలూరు, హాలహర్వి మీదుగా కర్ణాటకలోని బళ్లారికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. ఆ బస్సుల్లో కర్నూలులో ఎక్కి ఎక్కడ దిగినా మహిళలకు జీరో టికెట్ వర్తించడం లేదు. ఆస్పరి మీదుగా బళ్లారికి వెళ్లే బస్సుల్లోనూ అదే పరిస్థితి ఉంది.

పక్క రాష్ట్రాల్లో సరిహద్దు ప్రాంతం వరకూ..

కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలులో ఉంది. వారి రాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు అక్కడి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతినిచ్చింది. ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం ఇదేం న్యాయమంటూ మహిళలు విమర్శిస్తున్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు వరకు ప్రతి బస్సులోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని మహిళలు కోరుతున్నారు.

ఎమ్మిగనూరుకు వెళ్లినా డబ్బులు పెట్టాల్సి వస్తోంది



నేను కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాను. రోజూ ఎమ్మిగనూరుకు వెళ్లి వస్తుంటాను. మా ఊరి మీదగా వెళ్లే బస్సులు అంతర్‌రాష్ట్ర సర్వీసులని ఉచిత బస్సు వర్తించదని చెబుతున్నారు. దీంతో రాను పోను రూ.60 ఛార్జీ పెట్టుకోవాల్సి వస్తోంది. ఉచిత బస్సు వర్తించకపోవడం వల్ల నెలకు రూ.1800 నష్టపోతున్నాను. ఆ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం వర్తింపజేయాలి.

- ఎన్ ఈరమ్మ, నాగలదిన్నె, నందవరం మండలం.

నేడు 'డిఎస్‌సి' వెరిఫికేషన్ ప్రారంభం

- మూడు వెరిఫికేషన్ కేంద్రాలు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో 2545 పోస్టుల భర్తీ
- తప్పలు దొర్లకుండా చూస్తాం : డిఇఒ శామ్యూల్ పాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిఎస్‌సిలో తుదిగట్టం పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ప్రక్రియకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను మాత్రమే నేరుగా కేంద్రాలకు వచ్చి ధ్రువీకరణ పత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. డిఎస్‌సి పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2545 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తుది మెరిట్ జాబితాను రెండు రోజుల క్రితంవిడుదల చేశారు. మెరిట్ జాబితాలో పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వ్యక్తిగత లాగిన్లకు నియామక పత్రాలను విద్యాశాఖ పొందుపరిచారు. కర్నూలు నగరంలోని రాయలసీమ విశ్వవిద్యాలయం , నగర శివారులోని రాఘవేంద్ర బిఇడి కాలేజ్, శ్రీనివాస బిఇడి కాలేజీలను వెరిఫికేషన్ కేంద్రాలుగా గుర్తించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు దాదాపుగా 54 బృందాలను నియమించారు. ఇందులో 250 మంది ఉపాధ్యాయులను డిప్యూటేషన్ మీద వెరిఫికేషన్ ప్రక్రియకు నియమించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి కాగానే ఎంపికైన అభ్యర్థులకు కౌన్సి లింగ్ నిర్వహిస్తారు. సెప్టెంబర్ రెండవ వారంలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు పోస్టింగులను కల్పించేందుకు విద్యాశాఖ ఆదేశాలను జారీ చేసింది.

వెరిఫికేషన్ కేంద్రాల్లో డిఇఒ ఏర్పాట్ల పరిశీలన

డిఎస్‌సి అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సోమవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో వెరిఫికేషన్ కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ పరిశీలన చేశారు. వెరిఫికేషన్ కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు



మాట్లాడుతున్న డిఇఒ శ్యామూల్ పాల్

లేకుండా తగు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అభ్యర్థులకు ఇప్పటికే వారి మొబైల్ ఫోన్లకు సమాచారాన్ని కూడా చేరవేశామన్నారు. వెరిఫికేషన్‌లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన మూడు సెట్ల జిరాక్స్ పత్రాలతో కేంద్రాలకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటల నుండి వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అందరి సహకారంతో నగరాభివృద్ధి

- ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్
- నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూస్తాం
- కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగర ప్రజల సహకారంతో నగరం సమగ్రాభివృద్ధి చెందుతుందని, అందుకు ప్రజలందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్ తెలిపారు. నగరవాసుల సమస్యలపై ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నిర్మాణ వ్యర్థాలు లేకుండా చేస్తామని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

సి అండ్ డి వేస్టేజ్ నిర్వహణకు ఏ విధానం అమలు చేస్తున్నారు?

కమిషనర్: భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సరికొత్త విధానం ఆగస్టు ఒకటో తేదీ నుంచి తీసుకొచ్చాం. ప్రత్యేక నెంబర్ పెట్టి వాటి ద్వారా నగర పరిధిలో వేస్టేజ్ సేకరించి జొహరాపురం డంపింగ్ యార్డ్ వద్దనున్న సి అండ్ డి వేస్టేజ్ మేనేజ్మెంట్ ప్లాంట్లకు తరలిస్తాం. తద్వారా రీసైక్లింగ్ ప్రక్రియ చేపట్టి ఉన్నారు వినియోగానికి చర్యలు తీసుకుంటాం. ట్రాక్టరుకు రూ.500, టిప్పర్‌కు రూ.1000 చొప్పున రవాణా రుసుము మాత్రమే ప్రజలు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా నగరంలో నిర్మాణం వ్యర్థాలు లేకుండా చూస్తాం.

రహదారులపై పశువులు వదిలితే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: నగర రహదారులపై పశువులను వదిలితే ఇకపై చర్యలు తీసుకుంటాము. రహదారులపై సంచరించే పశువులను ఆధీనంలోకి తీసుకొని మూడు రోజుల్లో వచ్చిన యజమానులకు జరిమానా విధించి పశువులను అప్పగిస్తాం. మూడు రోజుల్లో లోపు పశువులను తీసుకువెళ్లని పక్షంలో వాటిని గోశాలకు తరలిస్తాం. శునకాల బెడద నివారణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు రోజువారి సామర్థ్యం సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

నగరం సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: నగర ప్రజలకు 24/7 గంటల పాటు సేవలు అందించేందుకు సిబ్బందితో ప్రత్యేక బృందం, ఒక టోల్ ఫ్రీ నెంబరు (7422992299) ను ఏర్పాటు చేసి వాటి ద్వారా తాగునీటి, వీధి దీపాలు, పారిశుధ్య ఇతరత్రా సమస్యలు సులువుగా పరిష్కరించేందుకు వీలు కల్పించాం. అలాగే ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి లిఖితపూర్వకంగా వినతులు విన్నవించినట్లయితే వాటిని పరిష్కరిస్తూ ఉన్నాం.

పన్నుల బకాయిలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: నగరాభివృద్ధికి పన్నులు పెంచకుండా ప్రభుత్వాలు ఎంతగానో సహకరిస్తున్నాయి. ఆర్థికంగా బలంగా ఉంటేనే మౌలిక సదుపాయాల కల్పన నగర అభివద్ధి సాధ్యమవుతుంది. ప్రస్తుతం ఉన్న పన్నులు కూడా కొంతమంది చెల్లించకపోవడం సమంజసం కాదు. కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయము పన్నులే. ఏటా రూ.100 కోట్ల ఆదాయం నగరపాలక సంస్థకు రావాల్సి. ఉంది కొంతమంది పన్నులు చెల్లింపునకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. వారిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. పన్ను వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. వారికి పన్నుదారులు సహకరించి సత్వరమే తమ ఆస్తి, కొళాయి, ట్రేడ్, వినోద పన్నులు బకాయిలు, చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి.

నగరంలో మౌలిక సదుపాయాలు కల్పనకు ఏం చేస్తున్నారు?

కమిషనర్: నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధి దీపాలు, గుంతలు పూడ్చడం వంటి పనులకు ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నాం. నగరంలో ప్రథమంగా తొమ్మిది పార్కులను ఎంపిక చేశారు. వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నాం. వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీ కాలువలు రహదారులను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుని నగరానికి 60 ఎంఎల్‌డిల మురుగునీటి శుద్ధి కేంద్రాలు అవసరం. 58 ఎంఎల్‌డిల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా అవసరమైన రెండు ఎంఎల్‌డిఎ ప్లాంట్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటాం.

పేదలకు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: నగరంలోని ఇల్లు లేని పేదలు ఇంటి కోసం తమ స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలంతో పాటు నిర్మాణానికి ప్రభుత్వ సబ్సిడీ ఇస్తుంది. ఇళ్ల స్థలాలు ఉన్న వారికి గృహాలు కేటాయిస్తాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి.

ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: నగరంలో వాహనాలు ఎక్కువయ్యాయి. దీనితో ట్రాఫిక్ అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడుతుంది. వీధి వ్యాపారస్తులు ఎక్కడ పడితే అక్కడ వ్యాపారం చేసుకుంటూ ఉండటం చేత ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. వారికి ఆమోదయోగ్యంగా ఉన్న ప్రదేశంలో వ్యాపారం చేసుకునేందుకు వీలు కల్పిస్తాం. ఎవరి జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నాం. వీధి వ్యాపారులంతా తోపుడు బండ్లు రోడ్లపై ఒక పక్క ఉంచుకునేలా సహకరించాలి.

సచివాలయ సిబ్బంది ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కమిషనర్: కార్పొరేషన్ పరిధిలోని సచివాలయ సిబ్బంది ప్రజలకు సేవలు అందించాలి. అందులో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో ప్రతి ఉద్యోగి తమ విధులను సక్రమంగా నిర్వహించాలి. సమన్వయంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి.





ర్యాలీని ప్రారంభిస్తున్న ఎఎస్‌పి

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

- 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' జెండా ఊపి ప్రారంభించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ప్రతి ఆదివారం పోలీసులు , ప్రజలు సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం , ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులతో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఆదివారం కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద **'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్'** కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంధర్భంగా హుస్సేన్ పీరా మాట్లాడుతూ ఆగష్టు 24 నుండి ప్రతి ఆదివారం పోలీసులు , ప్రజలు సైక్లింగ్‌లో పాల్గొనే విధంగా చేయడమే ఈ కార్యక్రమమన్నారు. వాహన కాలుష్యాన్ని తగ్గించడం పర్యావరణ స్థిరత్వానికి దోహదపడటం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలన్నారు. అది వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబానికి మేలు చేస్తుందన్నారు. ఆధునిక జీవనశైలిలో ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణించడం ఒక అలవాటుగా మారిందన్నారు. సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి హాని కలగదన్నారు. వ్యాయమాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సైకిల్ ర్యాలీ కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయం గేట్ ముందు (కొండారెడ్డిబురుజు) నుండి ప్రారంభమై ఓల్డ్ కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్ మీదుగా రాజ్ విహార్ కు , అక్కడి నుండి తిరిగి జిల్లా పోలీసు కార్యాలయంకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పిలతో పాటు ఎఆర్ డిఎస్‌పి భాస్కర్‌రావు, కర్నూలు రెండవ పట్టణ సిఐ నాగరాజారావు, ఆర్‌ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

29న మంత్రుల బృందం పర్యటన

- జిల్లా సరిహద్దుల మార్పుపై వినతి పత్రాలు స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లా, మండలాలు, గ్రామాలపేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి మంత్రుల బృందం ఈనెల 29న కకర్నూలు జిల్లాలో పర్యటించనుంది. ఈ మంత్రుల బృందంలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఉన్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్ బాష ఆదివారం తెలిపారు. ఈనెల 29న కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుండి మంత్రులు వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు కర్నూలు నగరంలోని సునయన ఆడిటోరియంలో వినతులు స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సరిహద్దుల మార్పులకు సంబంధించి మంత్రులకు వినతులను అందజేయవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హామీలు అమలు చేయాలని నేడు రజకుల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : ఎన్నికల ప్రణాళికలో రజకులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఈనెల 25వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకుజిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి. గురు శేఖర్ తెలిపారు. ఆ ధర్నా జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

- నూతన విద్యా హక్కు చట్టాన్ని రద్దు చేయాలి
- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్
- సైన్స్ పట్ల మక్కువ పెంచాలి
- వినియోగదారుల కమిషన్ సభ్యుడు నారాయణరెడ్డి
- జెవివి కర్నూలు జిల్లా 18వ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చిన్నప్పటినుండే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నూతన విద్యా హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ కర్నూలు జిల్లా కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలు ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు బీడీ సుధీర్ రాజు అధ్యక్షతన జరిగిన మహాసభలో ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్, వినియోగదారుల కమిషన్ బోర్డు మెంబర్ , సీనియర్ న్యాయవాది నారాయణరెడ్డి, రిటైర్డ్ ఆర్‌ఎంఒ డాక్టర్ రాంగోపాల్ , జెవివి రాష్ట్ర నాయకులు సురేష్ లుపాల్గొన్నారు. కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజల్లో మూఢనమ్మకాలు పెంచి పోషించే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలకు మతతత్వం వంట పట్టిస్తున్నారన్నారు. చరిత్రకు సంబంధించిన అనేక పాఠ్యాంశాలను తొలగిస్తున్నారన్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని కూడా నేటితరం వారికి తెలియకుండా చేసేందుకు పాలకులు కుట్ర పన్నుతున్నారన్నారు. శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలంటే అందుకు ప్రధాన ఆయుధంగా ఉన్న విద్యను అందరికీ అందేలా చూడాలన్నారు. విద్యార్థులకు సైన్స్ పరిణామాలను పూర్తిస్థాయిలో తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని పేర్కొన్నారు. శాస్త్రీయ విద్య అభివృద్ధికి యుటిఎఫ్ కూడా కృషి చేస్తుందనిపేర్కొన్నారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటినుండే విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. పుట్టినప్పటి నుండి చనిపోయేంత వరకు మూఢనమ్మకాల చుట్టూ మనిషిని తిప్పుతున్నారన్నారు. అలాంటి వాటిని పూర్తిగా తొలిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందు తుందన్నారు. నివేదిక చెప్పే కార్యక్రమాలకు న్యాయ సంబంధమైన సలహాలు సూచనలను అందించేం దుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. డాక్టర్ రామ్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే జనవిజ్ఞాన వేదికకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అందుకు అనుగుణంగా నాయకత్వం పనిచేసి సైన్సు ద్వారానే సమాజాభి వృద్ధి జరుగుతుందని ప్రజలకు తెలియజేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు సురేష్ మాట్లాడుతూ విద్యా ,వైద్యం ప్రజలకు అందేలా పాలకులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సాంస్కృతిక పరంగా కూడా ప్రజలను చైతన్యపరిచి శాస్త్రీయత వైపు నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాజా హుస్సేన్ కార్యదర్శి వేదికను ప్రవేశపెట్టి రాబోయే కాలంలో చేపట్టాల్సిన ఉద్యమాలపై కూడా నివేదించారు. మహాసభలో జెవివి జిల్లా సీనియర్ నాయకులు డాక్టర్ బడే సాహెబ్, సమత జిల్లా కన్వీనర్ రమాదేవి, మాజీ జిల్లా నాయకులు జె.రఘుబాబు, ధనుంజయ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి చేయాలి

- యువతకు ఉపాధి కల్పించాలి : డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పూర్తి చేసి యువతకు ఉపాధి కల్పించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఆదివారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం కర్నూలు నగరంలో జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. రామన్న, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, సంవత్సరం పూర్తయినా ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్ ప్రారంభించలేదన్నారు. కర్నూలు జిల్లాలో ఉన్న యువతకు ఉపాధి కల్పించే ఎమ్మిగనూరులో టెక్స్టైల్ పార్కు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. పత్తికొండలో టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి వలసలను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయలసీమ జిల్లాల్లో కరువు విలయతాండవం చేస్తోందన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపించాలన్నారు. 2014లో శంకుస్థాపన చేసిన రైల్వే వ్యాగన్ ఇప్పటిదాకా పూర్తి చేయకుండా రాజకీయ నాయకులు నిర్లక్ష్యం వల్లనే రైల్వే వ్యాగన్ పూర్తి కాలేదని వారు విమర్శించారు. ఈ జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు ఎంపీలు రైల్వే వ్యాగన్ పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఆధారిత పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి వలసలు లేకుండా చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఈ సమస్యలు పరిష్కారం కోసం యువతి, యువకులను ఐక్యం చేసి ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శిరీష, మైన, హుస్సేన్ బాషా, సహాయ కార్యదర్శులు బీసీ వీరేష్, ప్రకాష్, జిల్లా నాయకులు రాజు, సుకన్య, కిషన్ రెడ్డి, అంజి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న



చెత్తకుప్పలను చూపుతున్న నాయకులు

బాబాబృందావన్ నగర్‌లో సమస్యల తిష్ట

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- కాలనీలో పర్యటించిన పిపిఎస్‌ఎస్ నాయకులు


ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బళ్లారి చౌరస్తా సమీపంలోని బాబా బృందావన్ నగర్ వెళ్లే ప్రధాన రోడ్డుపై చెత్త కుప్పలు - వీధి కుక్కలతో నడవలేని పరిస్థితితులు ఏర్పడ్డాయి. కాలనీ సమస్యల పరిష్కారంపై నగరపాలక సంస్థ అధికారులు వివక్ష చూపుతున్నారని ఆ వార్డు మాజీ కార్పొరేటర్ సి.చలపతి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం పిపిఎస్‌ఎస్ ప్రతినిధి బందం స్థానికులతో కలిసి ఆనగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్ల నుండి లేని తాగునీటి సమస్య గత ఏడాది నుండి ఎందుకు వస్తుందని మున్సిపల్ ఇంజనీర్లను ప్రశ్నించారు. తాగునీరు వదిలినప్పుడు కరెంటు ఉండదు. కరెంటు ఉన్నప్పుడు తాగునీరు వదలరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. వర్షాకాలం కూడా తాగునీరు సరఫరా చేయలేరా అని ప్రశ్నించారు. బాబా బృందావన్ నగర్‌కు వచ్చే ప్రధాన రోడ్డుపై చెత్త కుప్పలు వీధి కుక్కలతో వీధిలోకి రావడానికి భయపడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రతి ఏటా ఇంటి పన్నులు పెంచడంపై చూపిస్తున్న శ్రద్ధ స్థానిక ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై లేదని అన్నారు. కమిషనర్ కాలనీలో పర్యటించి దీర్ఘకాలికంగా ఉన్న తాగునీరు ,పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ పర్యటనలో కాలనీ ప్రతినిధులు పరమేశ్వరయ్య, రహంతుల్లా, జనార్దన్ రెడ్డి, మహమ్మద్ యూనుస్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ఆ ఇంట.. ఉద్యోగాల పంట

- తమ్ముడు వెల్ఫేర్ అసిస్టెంట్.. అన్న ఉపాధ్యాయుడు..

ప్రజాశక్తి సి బెళగల్



టీచర్ పోస్టు సాధించిన శేఖర్ యాదవ్

ఆ ఇంట ఉద్యోగాలు పంట పండాయి.. సి బెళగల్ మండలంలోని కృష్ణదొడ్డిలో గోపాల్, పుష్పవతి దంపతులకు ఇద్దరూ కుమారులే...గత సచివాలయం ఉద్యోగాలకు తమ్ముడు శేఖర్ యాదవ్ ఎంపికయ్యారు.. ఈ డిఎస్‌సిలో అన్న జికె.రాముడు యాదవ్ ఉపాధ్యాయుడుగా రాణించారు.. జిల్లా 2 వ,స్టేట్ 13 ర్యాంకులను సొంతం చేసుకొని కుటుంబంలో మురిపించారు. వ్యవసాయ కుటుంబం, కూలీలుగా తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించగా కుమారులు ఉద్యోగాలను సాధించడంతో వారి కళ్ళలో ఆనందం వెల్లువిరుస్తోంది. పలువురు అబినందిస్తున్నారు.

ఉల్లికి కుళ్లు తెగులు

-రైతులను పట్టించుకోని వ్యవసాయ అధికారులు...

ప్రజాశక్తి-పత్తికొండ..

సాగుచేసిన ఉల్లి పంటకు కుళ్ళు తెగుళ్ళతో రైతులు లబోదిబోమంటున్నారు. గత 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఉల్లి పంటకు తేమ శాతం ఎక్కువ కావడంతో పంట పూర్తిగా నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ ఉద్యానవన శాఖ పరిధిలోని ఖరీఫ్ సీజన్‌లో పత్తికొండ, తుగ్గలి, మద్దికేర, దేవనకొండ మండలాలలో రైతులు ఉల్లి పంటను 3,250 హెక్టార్లలో సాగు చేశారు. గత ఏడాది 5,250 హెక్టార్లలో ఉల్లి పంట సాగైనట్లు వ్యవసాధికారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఉల్లిపంట సాగు తగ్గినట్లు కనిపిస్తుంది. జూన్,జులై మాసాలలో వర్షాలు పడక వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆగస్టులో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మొలకెత్తిన ఉల్లి పంట కాపాడుకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉల్లి పంట సాగు చేయడానికి ఎకరాకు సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. పంట ప్రారంభ దశనుంచే తెగుళ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు మొరపెట్టుకుంటున్నారు.



అధిక వర్షానికి కుల్లి పోతున్న ఉల్లిపైరు

పంటనష్టం జరిగినా ఇంతవరకు వ్యవసాయ అధికారులు పంట పొలాలను పరిశీలించిన దాఖలు లేవని రైతులు చెబుతున్నారు. పంటకు ఏ మందు పిచ్చికారి చేయాలో తెలియక తికమక పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫర్టిలైజర్ ప్రైవేట్ డీలర్లు రైతులను ఆసరా చేసుకుని తమకు ఇష్టం వచ్చి పిచికారి మందులు ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు పంట పొలాలను కాపాడుకోవడానికి సూచనలు ,సలహాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరారు.

పంట తీవ్ర నష్టం..

రైతు శ్రీరాములు-హోసూరు,



మూడు ఎకరాలో ఉల్లి సాగు చేశాను. సాగుచేసి 60 రోజులు అవుతుంది. ఎడతెరిపి లేని వర్షం కురవడంతో పంట పూర్తిగా నష్టం కలిగింది. పంటను కాపాడుకోవడాని ఏ మందు పిచికారి చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నా..

అధికారులు మొద్దు నిద్ర వీడాలి..

రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్



అధిక వర్షాలు వల్ల రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. వ్యవసాయ అధికారులు ఆఫీసులకే పరిమితం అవుతున్నారని మండిపడ్డారు. రైతుల పంట పొలాలు నష్టం జరిగితే పరిశీలించక ోపోవడం చాలా దుర్మార్గం. వ్యవసాయ అధికారులు మొద్దు నిద్ర వీడి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలి.

నీరు నిలువ లేకుండా చూసుకోవాలి

పత్తికొండ ఉద్యాన శాఖ అధికారి సునీల్



ఉద్యాన పంటల్లో నీరు నిలువ ఉంటే తెగులు బారిన పడే అవకాశం ఉంది. మచ్చ తెగుళ్ళ, వేరు కుళ్ళు తెగులు నుండి రక్షించుకోవడానికి 500 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ ను 20 కేజీల ఇసుకలో కానీ లేదా యూరియాలో కలిపి చల్లుకోవలెను. 19:19:19 -ఐదు గ్రాములు లీటర్ నీటికి , సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.5 గ్రాములు లీటర్ నీటికి పిచికారి చేయాలి. రైతు సేవాకేంద్రాన్నిసంప్రదించాలి.

ఆదోనిని జిల్లాగా చేయాలి

ఆదోని-ప్రజాశక్తి

ఆదోని జిల్లా సాధన కోసం పోరాటం అంతిమ దశకు చేరుకుందని ఆదోని డివిజన్ ఐదు నియోజకవర్గాల ప్రజలు గొంతు ఎత్తాల్సిన అవసరం ఏర్పడిందని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్అహ్మద్ తెలిపారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద పోస్టర్ల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాసంఘాలు, కార్మిక, కర్షక, వ్యాపార రంగాల సంఘాలను భాగస్వామ్యం చేస్తూ ఆదోని జిల్లా సాధన కోసం ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఇప్పుడు కాకపోతే మరి ఎప్పుడు? ఆదోని ప్రజలంతా వివిధ సంఘాల నాయకులు, సామాన్యులు సైతం కదిలి రావాలని పిలుపునిస్తున్నారు. ఆరేళ్లుగా ఆదోని జిల్లా సమితి ఏర్పాటు చేసి ఆదోని జిల్లా కోసం పోరాడుతున్నామన్నారు.

ఆదోని జిల్లా కోసం: దగ్గరలోని తహశీల్దార్, సబ్ కలెలెక్టర్, ఆర్‌డిఒ లకు ఆదోని జిల్లా డిమాండ్ చేస్తూ వినతి పత్రాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. సమిష్టిగా ఒత్తిడి తెస్తేనే ఆదోని జిల్లాగా మరో అవకాశం ఉంది. ఈ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆదోని జిల్లా సాధన సమితి నాయకులు

అవకాశం వదులుకోరాదన్నారు. ఖచ్చితంగా ఆదోని జిల్లా కనుచూపుమేరలో ఉంది. జిల్లా సాధించటానికి ప్రతి ఒక్కరు ముందుకు కదిలి రావాలన్నారు. ఈ నెల 29వ తేదీన కర్నూలుకు రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, మంత్రి సత్య కుమార్ జిల్లాల ఏర్పాటు, జిల్లాల సరిహద్దుల గురించి వినతిపత్రం తీసుకోడానికి వస్తున్నారు. కర్నూలుకు వెళ్లి కూడా మంత్రులను కలవాలని ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర యాదవ్, ఇర్షాద్, జహీర్ కార్యకర్తలు ఉన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్ఐ ఎపి శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిప్పగిరి

వినాయక చవితి పండుగ ఉత్సవాలను జరుపుకునే గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరు కూడా అనుమతులు తప్పకుండా తీసుకోవాలని ఎస్ఐ ఎపి శ్రీనివాసులు మండల ప్రజలకు తెలిపారు. ఆదివారం పలు గ్రామాలలో నేమకల్, కుందనగుర్తి, నంచర్ల, చిప్పగిరి, తదితర గ్రామాలలో పర్యటించిన ఎస్ఐ ఎపి శ్రీనివాసులు పర్యటించి ప్రజలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గ్రామంలో ఎక్కడెక్కడ విగ్రహాలు ప్రతిష్ట చేస్తున్నారో వివరాలు తెలుపుతూ అర్జిరాసి చలానాను https://ganeshutsav.net వెబ్‌సైట్‌లో మీసేవలో కట్టి అనుమతులు తీసుకోవాలని తెలిపారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో ఎక్కడ కూడా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిపినా అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన వారు ఎలాంటి డిజెలను ఏర్పాటు చేసుకోకూడదన్నారు. గ్రామ ప్రజలకు, మహిళలకు ఇబ్బంది కలిగేలా డిజెలు ఏర్పాటు చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులకు కచ్చితంగా కమిటీ సభ్యులలో కనీసం ముగ్గురు నుండి ఐదుగురి ఆధార్ కార్డు జిరాక్స్ ఇస్తూ వారి మొబైల్ నెంబర్‌ను తెలపాల్సి ఉంటుందన్నారు. పోలీసులు ఖాదర్ వలీ, షబ్బీర్, శంకర్ పాల్గొన్నారు.

శ్రీ మఠం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీ సుజయీంద్ర ఆరోగ్యశాలలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీ మఠం నిర్వహణలో ఉన్న శ్రీ గురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠంలో చదువుతున్న సుమారు 70 మంది విద్యార్థులకు దంతాలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి సమస్యలున్న వారికి ఉచితంగా మందులు ఇవ్వడంతో



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు , సిబ్బంది

దంతాల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కిశోక్ కుమార్ , ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీహర్ష, సుజయింద్ర వైద్యశాల సీనియర్ డాక్టర్ సుధీంద్రరావు, కో ఆర్డినేటర్ విజయేంద్ర రావు , వైద్యులు శ్రీకంఠ శాస్త్రి , ఫార్మసిష్టు ప్రదీప్ , టెక్నీషియన్ గురు ప్రసాద్, ఐడిఎ సంస్థ కార్యదర్శి డాక్టర్ రామచంద్ర రెడ్డి , డాక్టర్ అశోక్ కుమార్ , డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి , డాక్టర్ సతీష్ , విశాల్, ఆరోగ్య శాల సిబ్బంది అనుసూయ, భీమయ్య, రాము ఈరమ్మ,రాధ, శివమ్మ, శారమ్మ, వినోద్, దాసు, దేవణ్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన చేనేతలను ఆదుకోవాలి

మాజీ ఎంపి బుట్టా రేణుక

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

వర్షాలకు నష్టపోయిన చేనేత కుటుంబాలను ఆదుకోవాలని వైసిపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎంపి శ్రీమతి బుట్టా రేణుక ,పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ డిమాండ్ చేశారు. ఆదివారం చేనేతలను పరామర్శించారు. ప్రస్తుతం తాము నష్టపోయినా ఏ ఒక్కరూ పలకరించలేదని కూటమి ప్రభుత్వ వైఖరిపై ఆవేదన వ్యక్తం చేశారు. బుట్టా రేణుక మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో మగ్గం గుంతల్లో నీరు చేరి ముడిసరుకు తడిచిపోయి, పనుల్లేక, నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలతో గుడిసెల్లోనున్న తమ మగ్గాలతో పాటు ముడిసరుకు తడిచి నష్టపోయామని కొందరు కార్మికులు మా దృష్టికి తెచ్చారు. అని మగ్గం గుంతల్లో నీళ్లు ఆగడం వల్ల వాళ్ల పనులకు ఆటంకం కలిగి పనులు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎలక్షన్ ముందు చేనేతలకు ఇచ్చిన హామీలు 200 యూనిట్లు గుంత మగ్గాలకు, 500 యూనిట్లు కరెంటు మగ్గాలకు, ఉచిత కరెంటు, సంవత్సరానికి రూ.25000 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మా ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రతి సంవత్సరం రూ.24000 చేనేత నేస్తం కింద ఇచ్చేవారని, 100 యూనిట్లు ఉచిత కరెంటు చేనేతలకు అందించే వారని, కరోనా టైంలో



తడిసిన మగ్గాలను పరిశీలించి , చేనేతలో మాట్లాడుతున్న బుట్టారేణుక

కూడా చేనేతలను ఆదుకున్న ప్రభుత్వం మాదే అని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నష్టం వాటిల్లినప్పుడు వాలంటీర్లు, వార్డు సచివాలయ సిబ్బంది వాళ్ళ ఇళ్లకు వెళ్లి నష్టాన్ని తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే సమస్య తీర్చే వాళ్ళని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, కర్నూలు జిల్లా చేనేత అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, చేనేత మల్లికార్జున, కౌన్సిలర్ అంపమ్మ, చంద్రశేఖర్, కౌన్సిలర్ నీలకంఠ, జిల్లా అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, పట్టణ బిసి సెల్ అధ్యక్షుడు బోయబజారి, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, మాజీ కౌన్సిలర్ మధుబాబు, పాల్గొన్నారు.

హోటళ్లలో సుచి శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-ఆదోని



ఆహార పదార్థాలలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూనే హోటళ్ల నిర్వాహకులు సుచి శుభ్రత తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దగ్గు, జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. ఎక్కడపడితే అక్కడ తినుబండారాలు తిని రోగాలు పాలు కావద్దన్నారు. ఈగలు దోమలు ఎక్కువగా వృద్ధి చెంది వ్యాప్తికి అవకాశం ఇవ్వకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హోటళ్ల వంటశాలలు పరిశుభ్రంగా ఉంచుకొని నాణ్యమైన సరుకులతోనే ఆహార పదార్థాలు తయారు చేయాలన్నారు. కల్తీకి అవకాశం ఇవ్వకుండా, గ్లాసులు ప్లేట్లు వేడి నీళ్లలోనే కడిగించాలన్నారు. తప్పనిసరిగా ప్రతి హోటల్ యజమాని కస్టమర్లకు ఫిల్టర్ వాటర్ ఇవ్వాలన్నారు. ఆహార పదార్థాల ఉంచిన పాత్రలపై ఎప్పుడు కప్పి ఉంచాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ప్లేట్లు వాడకం నిషేధమని సూచించినా వాటినే ఉపయోగిస్తున్నారన్నారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, హోటల్ నిర్వాహణ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వాష్ బేసిన్, టాయిలెట్ రూము ఉండేలా చూసుకోవాలన్నారు. తరచుగా ఆదోని పట్టణంలో హోటళ్ళ,బేకరీ ,ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీ చేసి నిబంధనల విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యమే మున్సిపాలిటీ లక్ష్యమన్నారు.

రైతుల సంక్షేమానికి టిడిపి కట్టుబడి ఉంది

మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

రైతుల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణం లోని వ్యవసాయ మార్కెట్ కమిటీని సిబ్బందితో నాయకులతో కలిసి పరిశీలించారు. చైర్మన్ రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మార్కెట్ కు రైతులు విక్రయించేందుకు తీసుకొచ్చే పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు వచ్చేలా తమ ప్రభుత్వం చూస్తుందన్నారు. తమపై నమ్మకంతో ఈ మార్కెట్ యార్డ్ చైర్మన్ బాధ్యత నాకు అప్పగించినందుకు ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వరరెడ్డికి ఎప్పటికి రుణపడి ఉంటానన్నారు. చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ, రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువచ్చినప్పుడు వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా, తూకాలలో జరుగుతున్న అవకతవకలపై రైతుల నుండి ఫిర్యాదులు అందాయని, దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. మార్కెట్‌లోని పలు దుకాణాలను పరిశీలించిన ఆయన, కొన్ని చోట్ల తూకాలలో లోపాలను గమనించి, సంబంధిత హమాలీలను , వ్యాపారులను తీవ్రంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా,



మార్కెట్ యార్డ్ లో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ మల్లయ్య

మార్కెట్‌లో మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన అధికారులతో చర్చించారు. ఎమ్మిగనూరు మార్కెట్‌ను చుట్టుపక్కల ప్రాంతాల రైతులకు మరింత ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎల్ఐసి నరసింహులు, బిటి లక్ష్మన్న, జెసిబి రాజు, నజీర్, రంగస్వామి, పాండురంగ, లింగేష్, శేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం ప్రాణాన్ని నిలుపుదాం

-అరుదుగా ఉండే బాంబే బ్లడ్ గ్రూప్ రక్తదానం

ప్రజాశక్తి -ఆదోని

అరుదుగా లభించే ఓ నెగిటివ్ బాంబే బ్లేడ్ గ్రూపు రక్త దానం చేయించామని జనసేవ సామాజిక సేవ సంస్థ కార్యదర్శి విరుపాక్షి స్వామి ఆదివారం తెలిపారు. హైదరాబాదు బంజారా హిల్స్ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఏలూరు పట్టణానికి చెందిన కె.వి లక్ష్మికి ఓ నెగటివ్ బాంబే బ్లడ్ అవసరం వచ్చిందన్నారు. ఈ గ్రూపు రక్తం ఉండటం చాలా అరుదు అన్నారు. బ్లడ్ కోసం రోగి బంధువులు వెతుకుతూ తనకు సమాచారం వచ్చిందన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో ని తమ సేవా సమితి సభ్యుడు పరశురాము ఆ గ్రూపు కలిగి ఉన్నాడన్నారు. గుంతకల్ నుండి హైదరాబాద్ కు బయలుదేరి అర్ధరాత్రి ఓ నెగటివ్ బాంబే బ్లడ్ గ్రూప్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికి 35వ సారి పరశురాం స్వచ్ఛందంగా బ్లడ్ డొనేట్ చేశారన్నారు. రక్తహీనతతో



రక్తదానం చేస్తున్న యువకుడు

బాధపడుతున్న పేషెంట్ కు ఉచితంగా రక్తం ఇవ్వడంతో బంధువులు అభినందనలు తెలిపారన్నారు.



మట్టి వినాయక విగ్రహాలకు ఆహ్వానం

-పర్యావరణ పరిరక్షణ కోసం సహకరించండి

-పీఠాధిపతుల ద్వారా ఉచితంగా పంపిణీ -దాత రాఘవేంద్ర గౌడ్

ప్రజాశక్తి-మంత్రాలయం

పర్యావరణ పరిరక్షణ కోసం సహకరించేందుకు వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పొందవచ్చని దాత మాంచాలమ్మ దేవి ఆలయ పూజారి రాఘవేంద్ర గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు సమాచారం అందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తనవంతు సహాయంగా ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని భక్తులకు ఆహ్వానం పలికారు. ఈ నెల 26న స్థానిక పాత ఊరులో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి గుడి దగ్గర విగ్రహాల వితరణ ఉంటుందన్నారు. అవసరమైన వారు 8498832149కు ఫోన్ చేసి ముందుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

మట్టి వినాయకుడిని ఏర్పాటు చేద్దాం

- పర్యావరణాన్ని కాపాడుకుందాం - సిఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



మట్టి వినాయకుని ఏర్పాటు చేసుకుని పర్యావరణం కాపాడుకుందాం అని సిఐ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడాలని పట్టణ సిఐ శ్రీనివాసులు పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతు ఇప్పుడు వస్తున్న వినాయక చవితి పండుగ సందర్భంగా మీరు ఏర్పాటు చేస్తున్న విగ్రహాన్ని పర్యావరణాన్ని హాని కలిగించకుండా మట్టి వినాయకుని అందరు కూడా ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో యువతి యువకులు, పట్టణ ప్రజలు వినాయకుని ఏర్పాటు పైన అందరు మట్టి వినాయకుని ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడుకోవాలని, యువకులు అవగాహనా చేసుకోవాలిన్నరు. డివైఎఫ్ఐ నాయకులు రవి కుమార్, అజిత్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కరపత్రాలు పంచిన రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి- గోనెగండ్ల

ఎన్నికల ముందు రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ కర్నూలులోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గోనెగండ్ల మండలం నాయకులు శివ రాముడు, శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక రజక వీధిలో రజక సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి బిజెపి కూటమి నాయకులు తమ ఎన్నికల ప్రణాళికలో వృత్తిదారులకు రజక వృత్తి చెరువులపై పూర్తి హక్కులు కల్పిస్తామని జీవో నెంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్నధోబి పోస్టులను భర్తీ చేస్తామని, షాపులకు ధోబిఘాట్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తామని చెప్పి



కరపత్రాలు విడుల చేస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచిన ఇంతవరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు. అందుకే సోమవారం కలెక్టరేట్ జరిగే ధర్నాను రజక సోదరులందరూ కలిసి రావాలని కోరారు.

డిఎస్‌సికి ఎంపికైన ఉద్యోగులకు సన్మానం

-సత్కరించిన గ్రామ సర్పంచ్ లింగారెడ్డి

ప్రజాశక్తి మంత్రాలయం



మండల పరిధిలోని వగరూరు గ్రామానికి చెందిన మల్లెల లక్ష్మన్న ప్రభుత్వ ఉద్యోగిగా డిఎస్‌సి ద్వారా ఎంపికైన నేపథ్యంలో గ్రామ సర్పంచి లింగారెడ్డి శాలువలతో పూలమాలలు వేసి సత్కరించారు. గ్రామంలోని మల్లెల లక్ష్మన్న డిఎస్‌సి లో 52 వ ర్యాంక్ సాధించి స్కూల్ అసిస్టెంట్ గా ఎంపికయ్యారు. విషయం తెలుసుకున్న సర్పంచి ఆయన ఇంటికి వెళ్లి శాలువతో పూలమాల వేసి కేకుకట్ చేయించి ఆయనకు తినిపించి సంబరాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మల్లెల లక్ష్మన్న మాట్లాడుతూ రాంపురంరెడ్డి సోదరుల ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివి ఈ స్థాయికి చేరుకొన్నానని, పెద్దాయన టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ధరణీధర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా వినాయక చవితి

సిఐ విజయభాస్కర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రజలు వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని గోనెగండ్ల సిఐ విజయభాస్కర్ సూచించారు. ఆదివారం గోనెగండ్ల పోలీస్ స్టేషన్లో మండలంలోని అన్ని గ్రామాల గణేషు ఉత్సవ నిర్వాహకులు మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు కచ్చితంగా అనుమతి తీసుకోవాలని అందుకు సంబంధించి ఆన్‌లైన్ చలానా చెల్లించాలన్నారు. నిర్వాహకులు గణేష్ విగ్రహ మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. గణేష్ శోభాయాత్ర , గణేష్ నిమజ్జనం సందర్భంగా పాటించవలసిన నియమాలు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి అందరికీ వివరించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పిఎస్ఐ అనిల్ కుమార్ , సిబ్బంది వీరశైవ పీఠాధిపతి శివయ్య స్వామి , వివిధ గ్రామాల గణేష్ మండమాల నిర్వాహకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాను అడ్డుకున్న డైరెక్టర్ లక్ష్మన్న

ప్రజాశక్తి-మంత్రాలయం

మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలోని రేషన్ షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న ప్రజాపంపిణీ బియ్యంబస్తాలను టిడిపి నాయకులు కలుదేవకుంట సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న అడ్డుకున్నారు. ఆదివారం గ్రామంలోని డీలర్ నాగలక్ష్మికి చెందిన రేషన్ షాపు నెంబరు 13030/29 నుంచి సుమారు 30 క్వింటాళ్ల బియ్యం బస్తాలను ఆటోలో తరలిస్తుండా గమనించిన లక్ష్మన్న ఆటోను నిలిపవేశానని, అయినా సిద్ధయ్య, రోగప్ప, ఈరన్న, భీమయ్యలు మోసుకొని వెళ్లారని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్ కుమార్ ఆటోను పోలీస్ స్టేషన్ తరలించారని పేర్కొన్నారు. రేషన్‌డీలర్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని, వెంటనే రేషన్‌షాపును రద్దు చేసి అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు



బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని కొత్త జిల్లాతో పాటు, పెద్దహరివాణం మండలం రెవెన్యూ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ స్థానిక గ్రామ సచివాలయంలో గ్రామ ప్రజలు రైతులు నాయకులు పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ పెద్ద హరివణం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సోమవారం గ్రామం నుంచి 10 గంటలకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో ప్రారంభమై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం, ఎమ్మెల్యే పార్థసారధి కార్యాలయానికి పెద్ద ఎత్తున వచ్చి కార్యక్రమం చేపట్టాలని కోరారు.

కాంగ్రెస్ మైనార్టీ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆదోని

ఈ నెల 28న విజయవాడలో పిసిసి అధ్యక్షులు షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో జరుగు రాష్ట్ర మైనార్టీ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ ఉపాధ్యక్షుడు పి.అమన్, నియోజకవర్గ ఇంచార్జి రమేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎదగాలని వారి కషికి ప్రభుత్వాలు సహకరించాలన్నారు. విద్యాపరంగా మైనారిటీ విద్యార్థులు బడి దశలోనే ముగించి కూలి పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం వేశారు. దేశ రక్షణ కోసం ప్రజాస్వామ్య రక్షణ కోసం రాహుల్ గాంధీ అనునిత్యం పోరాడుతున్నారని అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం వారితో కలుస్తున్నారన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం ఏకలక్ష్యంగా పెట్టుకొని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలన్నారు. విజయవాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగు మైనార్టీ సభకు కర్నూలు జిల్లా నుంచి ప్రతి నియోజకవర్గం నుంచి వేలాది మంది మైనారిటీ సోదరులు భారీగా తరలివచ్చి దిగ్విజయం చేయలన్నారు. సమావేశంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ ఖాసీంవలి, ఆదోని పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, మాజీ కౌన్సిలర్ దిలీప్ దోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, ఆదోని పట్టణ యువజన అధ్యక్షుడు వీరేష్ పాల్గొన్నారు.

మునిసిపల్ ఉపాధ్యాయులకు అంతర్ యాజమాన్య బదిలీలు చేపట్టాలి

ప్రజాశక్తి - ఆదోని

జీరో సర్వీస్‌తో అంతర్ యాజమాన్య బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రమేష్ నాయుడు,పట్టణ అధ్యక్షుడు కె.రవి కోరారు. ఆదివారం సమావేశంలో మాట్లాడారు మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా స్పౌజ్, మ్యూచువల్ కేటగిరీలలో బదిలీలకు అనుమతించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలలు, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలు, గ్రేటర్ విశాఖ, విజయవాడ కార్పొరేషన్ పాఠశాలలు ఒకే మేనేజ్మెంట్ అనగా మున్సిపల్ మేనేజ్ మెంట్ పరిధిలో ఉన్నాయన్నారు. అంతర్ జిల్లా బదిలీలు కు అవకాశం ఒక జిల్లా నుండి ఇతర జిల్లాలలోని మున్సిపల్/కార్పొరేషన్/గ్రేటర్ కార్పొరేషన్ల లోని ఖాళీలకు గతంలో ఇచ్చిన పురపాలక శాఖ ఉత్తర్వులు జి.ఓ.నం.507, తేదీ 16.5.2018 మాదిరిగా ఈ బదిలీలు వర్తించే విధంగా అనుమతించాలన్నారు. బదిలీలు చట్టం..2025 ప్రకారం జూన్ లో జిల్లా స్థాయి బదిలీలు సందర్భంగా మున్సిపాలిటీ, నగరపాలక సంస్థ, గ్రేటర్ విశాఖ, విజయవాడ పరిధిలో మాత్రమే బదిలీలు నిర్వహించినందున ప్రస్తుత అంతర్ జిల్లా బదిలీలు సందర్భంగా ఒక రెవెన్యూ జిల్లా పరిధిలోని మున్సిపల్/నగరపాలక సంస్థ/గ్రేటర్ విశాఖ విజయవాడ లోని ఖాళీలకు కూడా స్పౌజ్ మరియు మ్యూచువల్ బదిలీలు చేయాలన్నారు. బదిలీలు జీరో సర్వీస్‌తో చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు భీమరాజు, లోక్య నాయక్ ఉరుకుందప్ప, ప్రసాద్ ఉన్నారు.




హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్

ట్రాఫిక్ సిఐ ఎస్ మన్సూరుద్దిన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని కర్నూలు ట్రాఫిక్ సిఐ ఎస్.మన్సూరుద్దీన్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ఆర్ఎస్ రోడ్డు ఐదు రోడ్ల కూడలిలో హెల్మెట్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. హెల్మెట్‌ను ధరించకపోతే రూ.1030 జరిమానా విధించాల్సి వస్తుందన్నారు. సెన్సార్ కెమెరాల ద్వారా కూడా హెల్మెట్ ధరించని వారిని గుర్తించి జరిమానా విధిస్తామన్నారు. ట్రాఫిక్కు సిగ్నలింగ్ నిబంధనలను కూడా తప్పనిసరిగా పాటించాలని అతిక్రమించిన వారిపై కూడా జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు అండ

చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో 13 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. షేక్ అబ్దుల్ ఆర్మాన్‌కు రూ.19,944, మరియమ్మకు రూ.65వేలు, షేక్ షేకూన్‌కు రూ.61,572, లక్ష్మీ నారాయణకు రూ.1,25,343, మీసాల మాధవస్వామికి రూ.85వేలు, రెహాన సుల్తాన్‌కు రూ.25,574, నజీర్ అహ్మద్‌కు రూ.55వేలు, నీలం మాధవరాయుడుకు రూ. 1,19,708, రాజకుమార్‌రెడ్డికి రూ.1,14,574, షేక్ ఖాజాబీకి రూ. 1,04,196, సుబ్బరామయ్యకు రూ.71,922, గౌండఅబ్దుల్ వహీద్‌కు రూ.43,565, ఉప్పు రామ పద్మజకు రూ.3,35,520ల చెక్కులు మంత్రి టి.జి భరత్ అందజేశారు. మొత్తం రూ.12,26,918ల విలువ చేసే చెక్కులు అందజేశారు. ఆపద సమయంలో కర్నూలు నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రికి , మంత్రి టీజీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న వారు సిఎంను, మంత్రిని మరిచిపోలేరన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరవుతారని, ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించే ఫిర్యాదులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. కాలనీలలోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి స్థానిక సమస్యలను ప్రజలు నేరుగా వచ్చి వివరించవచ్చని కమిషనర్ తెలిపారు.

దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలి

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బలరాం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లా నుండి ముఖ్యమంత్రిగా ఎదిగి ఎనలేని సేవలు అందించిన నేపథ్యంలో తప్పనిసరిగా ఆయన పేరు పెట్టాలన్నారు.

నేడు కలెక్టరేట్లో గ్రీవెన్స్ కార్యక్రమం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్లో సోమవారం నాడు ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ మున్సిపల్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితులు నేరుగా సమస్యలను విన్నవించుకోవాలని కోరారు

ఆరోగ్యకరమైన బాల్యం ఆటల తోనే సాధ్యం

- దృఢమైన సమాజాన్ని నిర్మిద్దాం

-సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఆరోగ్యకరమైన బాల్యం ఆటలతోనే సాధ్యమని సిఐటియు నగర కార్యదర్శి విజయ రామాంజనేయులు అన్నారు. జోహరాపురం భవిత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం యూనివర్సల్ కరాటే స్కూలు వారు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు మాస్టర్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. యూనివర్సల్ కరాటే గ్రాండ్ మాస్టర్ టి శ్రీనివాసులు, మాస్టర్లు అమితేష్, నాగన్న బాలకృష్ణ తిప్పన్న లు పాల్గొని గ్రేడింగ్ బెల్ట్ టెస్టును జరిపి వారికి బెల్టులను ప్రదానం చేసారు. ముఖ్య అతిథులు విజయ రామాంజనేయులు, భవిత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ నరేంద్ర మాట్లాడుతూ జోహరాపురంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో యూనివర్సల్ కరాటే స్కూల్ వారు నాలుగు సంవత్సరాల నుండి కరాటే నేర్పిస్తూ విద్యార్థి, విద్యార్థినీలకు మానసిక శారీరక బలాన్ని పెంచే పనిచేయడం అభినందనీయమని అన్నారు, దేశంలో ఇప్పుడు ఉండే వాతావరణ కాలుష్యం, నాణ్యతలేని ఆహారం వలన చాలామంది పిల్లలు అనారోగ్యానికి గురి కావడమే కాకుండా తల్లిదండ్రుల అతి గారాబం వలన పిల్లల ఎదుగుదల సరైన క్రమంలో ఉండడం లేదని గుర్తు చేశారు. అనేక రకాల సమస్యలు ఉన్నా సుందరయ్య స్ఫూర్తి కేంద్రం వారు వాటిని అధిగమించి పిల్లల మానసిక శారీరతగా అభివృద్ధి కోసమే కాకుండా మంచి సమాజం కోసం పనిచేస్తుండడం అభినందనీయమన్నారు. వారికి మా సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, ఖలీల్, కృష్ణ, మౌలాలి, నాగరాజు, అబ్దుల్లా, బహదూర్, మధు ఎర్రమల, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



-బెల్టులు అందజేస్తున్న సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు

రహదారి విస్తరణ బాధితులకు టిడిఆర్ బాండ్ల పంపిణీ

-తొలుత ముగ్గురికి అందజేత

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగర పరిధిలో ఎన్‌హెచ్ 340సి జాతీయ రహదారి విస్తరణలో స్థలం కోల్పోయే బాధితులకు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) బాండ్ల జారీ ప్రక్రియ ప్రారంభించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో స్థలం కోల్పోతున్న ముగ్గురు బాధితులకు టిడిఆర్ బాండ్లను అందజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య సర్కిల్ నుండి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు ఎన్‌హెచ్ 340సి జాతీయ రహదారిని 100 అడుగులుగా వెడల్పు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మొత్తం 2.34 కి.మీ పొడవున ఈ విస్తరణలో 201 ఆస్తులు ప్రభావితమవగా, 178 ఆస్తులు పూర్తి ప్రభావితం అవుతున్నాయన్నారు. ఈ క్రమంలో తొలుత భూములు కోల్పోయిన ముగ్గురు బాధితులకు టిడిఆర్ బాండ్లు అందజేశామన్నారు. త్వరలో మరో 40 మందికి బాండ్లు అందిస్తామన్నారు. ప్రభావిత ఆస్తిదారులకు ఇప్పటికే 159 నోటీసులు జారీ చేయగా, 110 మంది సమ్మతిపత్రాలు ఇచ్చారన్నారు. రహదారి విస్తరణకు ప్రజలు ఇస్తున్న సహకారం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



తన పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దిగజార్చిన జగన్‌కు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ అన్నారు. ఆదివారం ఆయన టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విభజన వలన రూ.90 వేలకోట్ల అప్పుతో, రూ.16500 కోట్ల లోటు బడ్జెట్‌తో ఆవిర్భవించిన నవ్యాంధ్ర ప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టారన్నారు. ఉండటానికి కార్యాలయం లేని పరిస్థితులలో బస్సులోనుండి రాష్ట్ర పరిపాలన ప్రారంభించి రాష్ట్రాన్ని పునర్నిర్మించిన నిరంతర శ్రామికుడాయన అన్నారు. విషయాన్ని జగన్ మరచిపోయినా రాష్ట్ర ప్రజలు మరచిపోరన్నారు. జగన్కు కూల్చడం తప్ప నిర్మించడం తెలియదన్నారు. అప్పులు చేస్తేకాని నాడు జగన్ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్, సంక్షేమ పథకాలు, ఇవ్వలేకపోయారని విమర్శించారు. దాదాపుగా రూ.11 లక్షల కోట్లు అప్పులు చేసి, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత వైసిపికే చెల్లిందన్నారు. తప్పుడు ఆరోపణలతో వైసిపి నాయకులు విషప్రచారం చేస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

సురవరం మృతి ఉద్యమాలకు తీరని లోటు

- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పత్తికొండ

సిపిఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి కమ్యూనిస్టుల ఉద్యమానికి తీరని లోటని సిపిఎం సీనియర్ నాయకుడు రంగారెడ్డి, మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం పత్తికొండ పట్టణంలోని ఈశ్వర్‌రెడ్డి భవనంలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలు వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఉద్యమాలకు ఆకర్షితుడై స్వాతంత్ర ఉద్యమలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల ఉద్యమంలోనూ పాల్గొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై ప్రజల సమస్యలపై నిరంతర పోరాటాలు చేశారని, ప్రజలకు చేసిన సేవలు మరవలేని అని అన్నారు.. పేద ప్రజల ప్రజా సమస్యలు పై నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర, సిపిఎం మండల కమిటీ సభ్యులు దస్తగిరి, సిద్దయ్య గౌడ్, ప్రజాసంఘల నాయకులు కాశన్న, దుగ్గెన్న, మధు, గిరి, రామాంజనేయులు పందికోన రంగన్న తదితరులు పాల్గొన్నారు.



సండే ఫర్ సైకిల్‌తో ఆరోగ్యం

ప్రజాశక్తి- సి బెళగల్



సండే ఫర్ సైకిల్ కార్యక్రమంతో పోలీసులకు ఉత్సాహం ఇవ్వడం తో పాటు ఆరోగ్యాంగా ఉంటుందని సి బెళగల్ పోలీసులు పేర్కొన్నారు. ఆదివారం ఎస్ఐ పరమేష్ నాయక్ సంబందించిన పోలీసు సిబ్బందితో ఈ సండే ఫర్ సైకిల్ కార్యక్రమాన్ని చేపట్టారు. మనిషి ఉత్సాహంగా ఉంటే అన్నీ పనులను సజావుగా చేసుకోగలడని ,అందులో పోలీసుల విధులు ఈ కార్యక్రమంతో ఉత్సాహంగా చేస్తూ ప్రజలకు మంచి సేవలు అందించేందుకు వీలుగా ఉంటుందన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి -సి ఐ

వినాయక చవితి ప్రశాతంగా నిర్వహించుకోవాలని భక్తజన బృందాలకు కోడుమూరు సిఐ తబ్రేజ్ సూచించారు. ఆదివారం సిబెళగల్ స్టేషన్‌ను సందర్శించారు. అల్లర్లు సృష్టించరాదని, డిజేలతో ప్రజలకు ఇబ్బంది కాకుండా చేసుకోవాలన్నారు.

రూ.70 లక్షలు ఖర్చు చేసినా అభివృద్ధికి నోచన స్మశాన వాటిక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



స్థానిక బుధవార్‌పేట 15వ వార్డులో హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోవడం లేదని సిపిఎం పర్యటనలో భాగంగా స్మశానాన్ని పరిశీలించిన సిపిఎం నాయకులు ఆర్.చంద్ర అధ్యక్షతన నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ, సిపిఎం నగర్ కమిటీ సభ్యులు ఆర్.కృష్ణ, సిపిఎం నాయకులు బంగి పద్మ మాట్లాడారు. హిందూ స్మశాన వాటిక కలెక్టర్ ఆఫీస్‌కు కూటవేటు దూరంలో ఉన్నా ప్రభుత్వం , మున్సిపల్ కార్పొరేషన్ రూ.70 లక్షలు మంజూరు చేసి అభివృద్ధి చేశామని శిలాఫలకం మాత్రం వేశారు. స్మశాన వాటికలో కంప చెట్లు పెరిగి దారి కూడా లేదన్నారు. శవాన్ని పూడ్చడానికి కూడా స్థలం లేదన్నారు. కాంట్రాక్టర్లతో కమీషన్లకు కక్కుర్తి పడిన అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి రూ.70 లక్షలు కాజేశారన్నారు. అంత్యక్రియతకు స్మశాన వాటికకు వచ్చిన వాళ్లు కాళ్లు చేతులు కడుక్కోవడానికి కనీసం కొళాయి కూడా లేదన్నారు. కనీసం వాచ్మెన్ , కాటీ కాపరి, ఎవరు కూడా లేనటువంటి పరిస్థితి ఉందన్నారు. ఎవరిని సంప్రదించాలో కూడా శవం పూడ్చాలనుకునేవారు ఎవరిని కలవాలో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. లేని పక్షంలో మున్సిపల్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు బి మద్దిలేటి, ఆర్. ఆంజనేయులు పాల్గొన్నారు.